# వధువు కావలెను

- కోలపల్లి ఈశ్వర్

వధువు కావలెను.

ఎమ్మెస్సీ చేసి ఓ ప్రైవేటు కంపెనీలో కెమిస్ట్‌గా పనిచేస్తూ నెలకి అయిదువేల రూపాయలు సంపాదిస్తున్న, అయిదడుగుల ఆరంగుళాల ఎత్తుగల, డెబ్బై అయిదు కేజీల బరువుగల స్ఫురద్రూపి, చురుకైనవాడు, మంచివాడు, గుణవంతుడు, శీలవంతుడు, నెమ్మదస్తుడు, ముప్ఫయి సంవత్సరాల యువకుడు, మొహం మీద స్ఫోటకం మచ్చలు గల అందమైన వరుడికి తగిన వధువు కావలెను.

ఆ దినపత్రిక లోపలి పేజీలో పెళ్ళిసంబంధాల పట్టికలో ఆ వరుడి వివరాలను మరోసారి చదివారు సుందరరామయ్య మాస్టారు. ఆసక్తిగా ఆ వివరాలను పెన్నుతో మార్క్ చేశారాయన.

సుందరరామయ్య ఆసక్తిని గమనించిన ప్రకాష్ ''ఏది బాబాయ్, ఆ పేపర్ ఇలా ఇవ్వు'' అంటూ అందుకుని ఆయన చూసిన వివరాలను చదివి పగలబడి నవ్వాడు. ''వీడెవడు బాబాయ్! మొహం మీద స్ఫోటకం మచ్చలు వున్నాయంటున్నాడు, అందమైన వాణ్ణంటున్నాడు, స్ఫోటకం మచ్చల మొహం ఎంతందంగా వుంటుందంటావ్?!''

''చూడు ప్రకాశం... అద్దానికి బేధభావాలు లేవు. అది అందర్నీ అందంగానే చూపిస్తుంది. గుణం ప్రదానంగాని, అందానిదేముంది చెప్పు. కులగోత్రాలన్నీ కలిశాయి. మన మాధవికి ఈ సంబంధం చూస్తే బావుణ్ణనిపిస్తుంది'' అన్నాడు సుందరరామయ్య.

''మీ ఇష్టం బాబాయ్... ఆ అబ్బాయిది రాజమండ్రి. నేను వెళ్లి సంబంధం చూసివస్తానయితే...'' చెప్పాడు ప్రకాష్.

''నేనూ వస్తాను, ఇద్దరం కలిసే వెళదాం.''

''సరే.. మీ ఇష్టం...'' అంటూ ఆ వరుడి వివరాలు, అడ్రసు ఓ తెల్లకాగితం మీద రాసాడు ప్రకాష్.

అప్పుడు అక్కడికొచ్చిన సుందరరామయ్య పెద్దకూతురు సుగుణ వాళ్లిద్దరికీ టీ కప్పులు అందించింది. టీపాయ్ మీదున్న ఖాళీ టిఫిన్ ప్లేట్లు తీసుకుంటూ ''చెల్లికి సంబంధం దొరికిందా నాన్నా...'' సౌమ్యంగా అడిగింది.

''అవునమ్మా...''

''అబ్బాయేం చేస్తాడు?''


సుందరరామయ్య వివరాలు చెప్పాడు. ''అబ్బాయిని చూడటానికి ప్రకాష్, నేనూ రేపు వెళుతున్నాం.''

''ఈ సంబంధం ఖాయమైతే బావుణ్ణు'' అని, మరొక్కమాట మాట్లాడకుండా మౌనంగా వంటగదిలోకి వెళ్లిపోయింది సుగుణ.

ఆమెను చూసినప్పుడల్లా సుందరరామయ్యకి మనసులో ముల్లుగుచ్చుకున్నట్టు వుంటుంది. ముప్పయ్యేళ్లు మీదపడ్డా పెద్దకూతురికి పెళ్లిచేయలేకపోయాడాయన. సుందరరామయ్య మీద బాధ్యతలు అలా పడ్డాయి మరి. ఆయన తల్లిదండ్రులు బాధ్యతలు తీర్చుకోకుండానే కాలం చేశారు. పెళ్లీడుకొచ్చిన చెల్లెలు బాధ్యత, కాలేజీలో చదువుతున్న తమ్ముడి బాధ్యత ఆయన మీద పడింది. హైస్కూలులో లెక్కలు మాస్టారుగా పనిచేస్తున్న సుందరరామయ్య తన కుటుంబ పోషణకీ, అదనపు బాధ్యతలకీ లెక్కలు వేయాల్సివచ్చింది. లోటు బడ్జెట్ అగాధంలా కనిపించి బెదిరించింది. ఇలా అయితే లాభం లేదనుకుని, తన కుటుంబ లెక్కని సరిచేయడానికి ఆయన శ్రమగంటలు పెంచుకున్నాడు. స్కూలు అయిపోగానే, ఇంటా బయటా కూడా ట్యూషన్స్ చెబుతూ అదనంగా సంపాదించసాగాడు. డి.ఎస్.పి.గారి అమ్మాయికి వాళ్లింట్లో ట్యూషన్ చెబితే ఎక్కువ డబ్బులిస్తారని రాత్రి తొమ్మిదినుంచి పది గంటల వరకూ అక్కడ ట్యూషన్ చెప్పేవాడు. సరైన నిద్రలేక, భోజనం చెయ్యడానికి ఒకోసారి టైములేక, చెమటని రక్తంగా మార్చి శ్రమపడ్డాడాయన. సుందరరామయ్యగారి కష్టం చూసి ఆయన భార్య నిర్మల కంట్లో నీళ్లు తిరిగేయి. ఆయన చూస్తే కోప్పడతారని కళ్ళనీళ్లు తుడుచుకుని బాధని గుండెల్లో దాచుకునేదా ఇల్లాలు.

అలా కష్టపడి డబ్బు కూడబెట్టిన సుందరరామయ్య ఎలాగైతే ఓ మంచి సంబంధం చూసి చెల్లెలు పెళ్లి తనకున్నంతలో ఘనంగానే జరిపించాడు. ఆమె భర్త కార్పొరేషన్‌లో గుమస్తా. వాళ్లకో కొడుకు పుట్టాడు.

తమ్ముణ్ణి డిగ్రీవరకు చదివించాడు సుందరరామయ్య. పోటీ పరీక్షలు రాసి, ఆయన తమ్ముడు బ్యాంకు ఉద్యోగం సంపాదించుకున్నాడు. నచ్చిన అమ్మాయిని చూసి, తమ్ముడి పెళ్లికూడా చేశా



యన.

ఈ బాధ్యతలన్నీ పూర్తయ్యేసరికి సుందరరామయ్య పెద్దకూతురు సుగుణకి పెద్దవయసొచ్చేసింది. చూసిన రెండుమూడు సంబంధాలవాళ్లూ ఆమెకి పెద్దవయసని చెప్పి వెనక్కి వెళ్లిపోయారు.

పరిస్థితుల్ని జీర్ణించుకుని, కోరికల్ని చంపుకున్న సుగణకి పెళ్లిమీద ఆసక్తిపోయింది. 'నాకిక సంబంధాలు చూడొద్దు నాన్నా. మీకు, అమ్మకి సేవ చేసుకుంటూ ఇక్కడే వుండిపోతాను' అంటూ వంటింటికి అంకితమైపోయింది. వేదాంత ధోరణిని అలవరచుకుని ఓ యంత్రంలా, మరబొమ్మలా మౌనంగా వుండిపోయిందామె. అవసరమైతే తప్ప ఎవరితోనూ మాట్లాడదు. ఆ మాటలు కూడా చాల క్లుప్తంగా వుంటాయి.

పేరుకి తగినట్టుగా సుగుణాల రాశి అయిన తమ పెద్దకూతురు జీవితం అలా అయిపోవడం ఆ తల్లి దండ్రుల్ని కలిచివేసింది. ఏదో కడుపుకింత తిని, నిద్రరాక సుగుణ భవిష్యత్తు గురించి దుఖించిన రోజులెన్నో వున్నాయి. వాళ్ల బాధని ఒకోసారి గ్రహించిన సుగుణ అమ్మా నాన్నలని నవ్వించడానికి ''మా మేనత్త కొడుకుని పెళ్లాడతాలే..'' అంటూ నవ్వేసేది. అంత బాధలోనూ ఆమె ఎలా మాట్లాడగలుగుతుందో వాళ్లకి అర్ధమయ్యేది కాదు.

అప్పటికి రెండో కూతురు మాధవి వయసు ఇరవై ఏళ్లు. ఇలాగే ఊరుకుంటే ఆమెకి కూడ పెళ్లివయసు దాటిపోతుందని భయపడిన సుందరరామయ్య దంపతులు మాధవికి సంబంధాలు చూడటం ప్రారంభించారు. వాళ్లకి దూరపు బంధువూ, ఆ ఊళ్లోనే డిగ్రీకాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ప్రకాష్. సతీసమేతంగా వచ్చి వాళ్లింటనే దిగారు. అతనికి సుందరరామయ్యంటే ప్రత్యేకమైన అభిమానం. ప్రకాష్ పదోతరగతి చదివే రోజుల్లో లెక్కలు పరీక్షలో ఫెయిలయితే, వాళ్ల తల్లిదండ్రులు అతన్ని సుందరరామయ్య ఇంట్లో కట్టేశారు. ప్రకాష్ లెక్కలు సరిగా చెయ్యకపోతే చమడాలు వలిచేయమని కూడ చెప్పారు. వాళ్లు చెప్పినా చెప్పకపోయినా సుందరరామయ్య లెక్కలు చెప్పడంలో ఫస్టు, యమస్ట్రిక్టు. లెక్క తప్పిందంటే వీపు విమానం మోతెక్కేది! జుట్టుపట్టుకుని వంచి వీపుమీద ఒక్క గుద్దు గుద్దేవారు! ప్రకాష్‌కి కూడ ఆయన అలాగే లెక్కలు నేర్పారు. 'జీతం లెక్కలు సరిగ్గా రావాలంటే, ముందు ఈ లెక్కలు సరిగ్గా చెయ్యాలి' అనేవారు. సుందరరామయ్య క్రమశిక్షణలో ప్రకాష్ పదోతరగతి గట్టెక్కించాడు. ఆ తర్వాత అతను వెనక్కి తిరిగి చూడలేదు. తానీరోజు లెక్చరర్‌గా స్థిరపడ్డాడంటే అదంతా బాబాయ్ చలవేనని అతనికి తెలుసు. అందుకే ఆ కుటుంబమంటే ప్రకాష్‌కి ఎంతో ప్రేమ, అభిమానం.



సుందరరామయ్య ఇంటికి దగ్గర్లో ఓ అద్దిల్లు తీసుకుని భార్యతోసహా అద్దింటికి మకాం మార్చాడు ప్రకాష్. మాధవి కోసం అతను కూడా ఓ సంబంధం తీసుకొచ్చాడు. కాని అది కుదరలేదు. అయినా పట్టుదలగా వేరే సంబంధాలు చూస్తూ, ఆ కుటుంబానికి తన సహాయ సహకారాలు అందిస్తున్నాడతడు.

''ప్రకాష్... రేపు మన ప్రయాణం ఖాయమేగా?'' అని అడిగాడు సుందరరామయ్య.

''తప్పకుండా వెళదాం బాబాయ్, నేనోసారి కాలేజీకి వెళ్లొస్తాను'' చెప్పాడు ప్రకాష్.

• • •

బస్సుదిగి చకచకా నడుస్తున్న సుందరరామయ్యతో సమానంగా నడవలేకపోయాడు ప్రకాష్. డెబ్బై ఏళ్ళొచ్చినా కూడ ఆరోగ్యంగా వుంటాడాయన. ఆ రోజుల్లో వాళ్లు తిన్న తిండి వేరు, వాళ్ల ఆరోగ్యాలు వేరు అనుకుంటూ ఆయన వెంట గబగబా నడవడానికి ప్రయత్నించాడు ప్రకాష్.

ఆ అడ్రస్ చాల ఈజీగానే దొరికింది. బొమ్మరిల్లులా వున్నా ఆ ఇల్లు చూడటానికి బావుంది. ప్రకాష్ కాలింగ్ బెల్ నొక్కాడు.

లుంగీలో వున్న ఓ వ్యక్తి తలుపుతీసి, తొంగి చూశాడు. అతని మొహం మీది స్ఫోటకం మచ్చలు చూడగానే తాము సరైన అడ్రసుకే వచ్చామని ప్రకాష్‌కి అర్ధమైంది. ''పెళ్లిసంబంధం మాట్లాడ్డానికి వచ్చాం'' అని అతడనగానే, మరో మాటకి అవకాశం లేకుండా తలుపు తెరచి వాళ్లని లోనికి ఆహ్వానించాడా వ్యక్తి.

ఇద్దరూ ముందు గదిలో సోఫాలో కూర్చు

న్నారు. అతను లోపలికెళ్లి సఫారీ డ్రెస్ వేసుకుని వచ్చాడు. అప్పుడతన్ని పరీక్షగా చూసిన సుందరరామయ్య, ప్రకాష్ లిద్దరూ ఒకేసారి ఆశ్చర్యపోయారు. దానికి కారణం, పెళ్లి ప్రకటనలో ఇచ్చినట్టు అతని వయసు ముప్పయి కాదు, నలభై అయిదేళ్లు ఖచ్చితంగా వుంటుంది! దానికితోడు నున్నగా మెరుస్తున్న బట్టతల ఒకటి!

"నాపేరు చంద్రం... మా అమ్మా నాన్న అనుకోకుండా నిన్ననే తిరుపతి వెళ్లారు. నాలుగురోజుల తర్వాత వస్తారు'' చెప్పాడతను.

తప్పుడు ప్రకటన ఇచ్చి తమని ఇంతదూరం రప్పించిన అతనిమీద ప్రకాష్‌కి మండుకొచ్చింది. "మీ వయసెంత?'' అని అతని మొహంలోకి సూటిగా చూస్తూ అడిగాడు. ఆ మాటతో చంద్రంకి కంగారొచ్చింది. మాట తడబడ్డాడు. "ము..ముప్పయి అయిదు..'' ఎందుకైనా మంచిదని శుభలగ్నం ప్రకటన వయసుకి ఐదేళ్లు జోడించి చెప్పాడు.

"కాదు, మీ వయసు నలభై అయిదేళ్లకి తక్కువుండదు..''

"కాదు కాదు..'' అంటూ అతను తనను తాను కవర్ చేసుకోవాలని చూశాడు.

"అసలు నీ మొహం అద్దంలో ఎప్పుడైనా చూసుకున్నావా?'' కోపంగా అనేసిన ప్రకాష్‌ని ఆపాలని చూశారు సుందరరామయ్య. కానీ వీలుపడలేదు.

అతని మాటలకి చంద్రం తెల్లమొహం వేశాడు. "అదేంటండీ, అలా మాట్లాడతారు!'' అన్నాడు మెల్లగా.

"లేకపోతే ఏంటిమరి, నలభై అయిదేళ్ల వయసు దాచుకుని ఆడపిల్లలా తక్కువ వయసు చెప్తావా?''

అతను జవాబు చెప్పలేకపోయాడు.

"మా చెల్లెలి వయసు ఇరవై ఏళ్లు. ఆమెకంటే పాతికేళ్లు పెద్దవాడివి. నీకు మా చెల్లినిచ్చి పెళ్లెలా చేస్తామనుకున్నావ్!''

"చెయ్యమని నేను అన్లేదు కదండీ...''

"నీ తప్పుడు ప్రకటన చూసి, నీ వయసు తక్కువ అనుకునే కదా మేం ఇంతదూరం వచ్చాం.''

"మీలాగే ఇంతకుముందు వచ్చిన మూడు సంబంధాలు వెనక్కిపోయాయి. వాళ్లు పోతూ పోతూ నానా తిట్లు తిట్టిపోయారు'' నిజాయితీగా చెప్పాడు చంద్రం.

"తప్పుడు ప్రకటనలిస్తే తిట్టరామరి! ఇంకా నయం, వాళ్లు మంచివాళ్లు కాబట్టి తిట్లతో సరిపెట్టారు!'' అని ప్రకాష్ అనేసరికి అతనికి భయం వేసింది. "మీరిప్పుడు నన్ను కొడతారా ఏంటి?'' అన్నాడు చంద్రం, కొంచెం కంగారుగా.

"లేదులే బాబూ, మేం అలాంటివాళ్లం కాదు. ప్రకాష్ నువ్వూరుకో..'' అని సుందరరామయ్య చెప్పేసరికి అతడు శాంతించాడు.

"క్షమించండి.. ఆ ప్రకటన మా నాన్నగారు ఇచ్చారు. నా వయసు తక్కువ చెప్పమని మావాళ్లు ఒత్తిడి చేయడంవల్ల అలా చెబుతున్నాను.''

ఎందుకోగాని అతని నెమ్మది స్వభావం సుందరరామయ్యకి నచ్చింది. ప్రకాష్‌కి మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. మా అక్కయ్య సుగుణకి ముప్పయి ఆరేళ్ల వయసు. మీకు ఈడు జోడుగా వుంటుంది. మీకు నచ్చితే, సంబంధం మాట్లాడుకుందాం'' అని వెంటనే చెప్పాడు.

"అమ్మాయి ఫోటో వుందా?'' అని సౌమ్యంగా అడిగాడు చంద్రం.

"ఆ !.. వుండాలి'' అంటూ తన బ్యాగ్ తెరిచి చూశాడు ప్రకాష్. కార్డు సైజు సుగుణ ఫోటో తీసి అతనికి అందించాడు. ఆ ఫోటో చూసిన వెంటనే అతని మొహంలోని మెరుపుని ప్రకాష్ కనిపెట్టాడు.

"అమ్మాయి నాకు నచ్చింది'' అని చెప్పాడు చంద్రం.

"మరి చూసుకోవడానికి ఎప్పుడొస్తారు?''

"ఇక చూడటం ఏమీలేదు, నాకు కట్నకానుకల మీద ఆశలేదు. నా ఫోటో మీ అమ్మాయికి చూపించి కబురుచేస్తే, మా అమ్మానాన్నలు తిరుపతి నుండి రాగానే తాంబూలాలు తీసుకోవడానికి మీ ఇంటికి వస్తాం...'' చెప్పాడు చంద్రం.

సుందరరామయ్య, ప్రకాష్‌ల మొహాల్లో ఆనందం తొణికిసలాడింది.

లోపల నుంచి తన ఫోటో తెచ్చి ప్రకాష్‌కి ఇచ్చాడు చంద్రం.

"మేం ఇక వెళ్లొస్తాం బాబూ'' అంటూ లేచాడు సుందరరామయ్య. కాఫీ తీసుకుని వెళ్లమని అతను చెప్పినా వాళ్లు వినలేదు. మళ్లీ వస్తాం కదా అని చెప్పి, వాళ్లిద్దరూ బస్టాప్‌కి వచ్చేశారు.


"పోనీలే బాబాయ్, వచ్చినందుకు మంచే జరిగింది. మాధవి కోసం వస్తే సుగుణకి సంబంధం కుదిరింది'' అన్నాడు ప్రకాష్.

"ఈరోజు నాకు చాలా ఆనందంగా వుందిరా ప్రకాష్. సుగుణకి ఇక పెళ్లియోగం లేదేమోనని అనుకున్నాం. అనుకోకుండా ఇలా కలిసివచ్చింది'' అంటున్న సుందరరామయ్య కళ్లల్లో నీటిపొర కదిలింది.

అప్పుడే తమ ఊరు బస్సు వచ్చింది. ఎక్కి కూర్చున్నారు సుందరరామయ్య, ప్రకాష్. ఆ శుభవార్తని తమ ఇంట్లో ఎప్పుడెప్పుడు చెబుదామా అనే ఆతృత ఆ ఇద్దరిలోనూ చోటుచేసుకుంది.

బస్సు వాళ్ల ఊరుని సమీపించింది. ★

## సాయి విజృంభణ



'ఎకె-47' సినిమా కన్నడంలో దుమ్ముదులిపేసి, సూపర్ హిట్ కావడంతో కన్నడంలో సాయికుమార్ తన స్థానాన్ని మరోసారి బుజువు చేసుకున్నాడు. 'పోలీస్ స్టోరీ'లో మొదలయిన సాయికుమార్ ట్రెండ్, మధ్యలో కొన్ని పరిస్థితులరీత్యా బ్యాక్ అయింది. అతడు అక్కడి మాఫియాకు భయపడి తెలుగు ఇండస్ట్రీకి వచ్చేసాడు. ఇక్కడ అతడికి వరుస ఫ్లాపులు ఎదురుకావడం, అదే సమయంలో కన్నడ మాఫియా సాయికుమార్‌తో రాజీకి రావడం జరిగింది. దాంతో సాయికుమార్‌కి కన్నడంలో ఆహ్వానం లభించింది. రీఎంట్రీలో మొదటి సినిమానే సూపర్ డూపర్ హిట్ కావడంతో సాయికుమార్ కోసం కన్నడంలో నిర్మాతలు ఎగబడుతున్నారట. ఇంతకీ కొసమెరుపు ఏమిటంటే- సుమన్‌కి కన్నడంలో ఒకటీ అరా సినిమాలుండేవి. సాయికుమార్ ఎంట్రీతో సుమన్ పూర్తిగా కనుమరుగయిపోయాడు. దటీజ్ సాయికుమార్!

-జె.వి.బాబు

